

కంపోస్టు యార్డులో వ్యర్థాల గుట్టలు

కొండల్లా.. కంపోస్టు

- పేరుకుపోతున్న చెత్తాచెదారాలు
- గాంధీజయంతికి అన్నారు.. నేటికీ పూర్తికాని పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలోని కంపోస్టు యార్డులో చెత్త నిల్వలు కొండల్లా పేరుకుపోయాయి. టన్నుల కొద్దీ వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. యార్డులో వ్యర్థాలను తొలగించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీకల్లా కంపోస్టుయార్డు లోని వ్యర్థాలను తొలగించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే గాంధీ జయంతి జరిగి మూడు వారాలు అవుతున్నా యార్డులో వ్యర్థాలు కొండలను తలపిస్తున్నాయి. చెత్తను ఎరువుగా మర్చే ప్రక్రియను సాగదీస్తున్నారు. జిల్లాలో ఇతర మున్సిపాల్టీల్లో పనులు పూర్తయినా జిల్లా కేంద్రమైన నరసరా వుపేటలో కొలిక్కిరావడంలేదు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను వేరు చేసి మట్టిని మున్సిపాలీటీలోని లోలెవల్ ప్రాంతాలకు వినియోగించాలి. ఈ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో పురపాలకులకే తెలియాలి. కంపోస్టు యార్డులోని 30,609 టన్నుల వ్యర్థాలను తొలివిడత తొలగించాల్సి ఉంది. ఈ పనులే ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇంకా సుమారు 54 వేల టన్నుల వ్యర్థాలను రెండో విడతలో తొలగించాల్సి ఉంది. వ్యర్థాల తొలగింపుపై పర్యవేక్షణ కొరవడటంతో నరసరావుపేట మున్సిపాల్టీ రాష్ట్రంలోనే వెనుకబడి ఉంది.

ఎరువుల అధిక ధరలపై చర్యలు

- వ్యవసాయశాఖ జేడీ జగ్గారావు

నరసరావుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, అధిక ధర వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ జేడీ జగ్గారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలించమన్నారు. అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించామన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, నిబంధనలు పాటించకపోయినా డీలర్ల లైసెన్సు రద్దు చేయడంతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 52,881 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల దృష్ట్యా నిర్దేశించిన పరిమాణం కన్నా ఎక్కువ యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 9,807 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. రబీ సాగుకు అవసరమైన 69,000 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రతిపాదనలు అందజేశామన్నారు. రైతులు వారు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించే వారిపై సంబంధిత వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. ఎరువుల సరఫరాలో జాప్యం జరగకుండా, రైతుల అవసరాల మేరకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుం టున్నట్లు జేడీ తెలిపారు.

మొంథా.. అలర్ట్

తుఫానుపై హెచ్చరికలు జారీ

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఎక్కడికక్కడ ఏర్పాట్లతో సర్వం సన్నద్ధం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు
- పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు
- భారీ వర్షాలపై హెచ్చరికలతో ఆందోళనలో రైతులు



రెంటచింతల మండలం గోలి గ్రామంలో పత్తి చేలో నిలిచిన వర్షపు నీరు



- ఆరెంజ్ అలెర్టు.. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

నరసరావుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుఫాన్‌పై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సర్వం సిద్ధమయ్యారు. ఎక్కడికక్కడ ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడు రోజులు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మండల, గ్రామ స్థాయిల్లో కూడా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎటువంటి పరిస్థితి నెలకొన్నా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని, నదీ తీర ప్రాంత, లంక గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. మొంథా తీవ్రత ఏ స్థాయిలో ఉన్నప్పటికీ సమర్థంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నారు. జలవనరులు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, వ్యవసాయ, రవాణా, విద్యుత్, మత్స్య శాఖలను అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే ఇళ్ల నుంచి బయటకు రావాలని అధికారులు సూచించారు. మొత్తం మీద తుఫాన్‌కు సంబంధించి ముందస్తు చర్యల్లో అధికారయంత్రాంగం నిమగ్నమైంది. వాయుగుండం ప్రభావంతో జిల్లాలో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. మొంథా తుపాను తరముకు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే చేపట్టాల్సిన ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ కృతికాశుక్లా తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు జిల్లాఅధికారులతో సమీక్షిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూం నెంబరు 08647 252999 నెంబరుకు కాల్ చేసి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. కాగా నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపాల్టీలు, విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో పత్తి, కంది, వరి, మిర్చి తదితర పొలాల్లో పెద్దఎత్తున నీరు నిలిచి ఉంది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు పడితే పంటలు పూర్తిగా దెబ్బతిని నిండా మునిగిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నారు.

ఆరోగ్యశాఖ.. మూడు అంచెల వ్యూహం

తుపాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్య శాఖ మూడు అంచెల వ్యూహంతో సిద్ధమైంది. వైద్యులు ఎలా స్పందించాలి అనే అంశంతో పాటు వ్యాధులు ప్రబలకుండా, పునరావాస, ఇతర జాగ్రత్తలపై ప్రణాళిక రూపొందించింది. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వ లతో పాటు అత్యవసర పరిస్థితుల్లో గర్భిణుల తరలింపుపై ప్రణాళిక రూపొందించింది. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలపై సూచనలు జారీ అయ్యాయి. తుఫాన్ అనంతరం కాలనీలు, గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో కలసి పని చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎక్కడికక్కడ 108, 104, 102 అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.



పెదకాకాని శివాలయంలో నెలకొన్న భక్తుల రద్దీ

కార్తీక సందడి

- ఆలయాల్లో భక్తుల దీపారాధనలు
- అమరారామం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు

అమరావతి, పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలను వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి ముందు భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఉచిత దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయంలో తీర్థప్రసాదాలు అందలేదు. ప్రశ్నించిన భక్తులపై అర్చకులు దురుసుగా సమాధానం చెప్పడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తులు యజ్ఞాలబావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రదక్షిణలు చేసి దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ నిత్య అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి మేధాదక్షిణామూర్తి మాలధారణ

నరసరావుపేట రూరల్: మేధా దక్షిణామూర్తి క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ప్రథమ కార్తీక సోమవారం నుంచి మేధా దక్షిణామూర్తి మాలధారణ మండల దీక్ష కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. డిసెంబరు 6న త్రికోటేశ్వరస్వామికి ఆరుద్రోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండల దీక్ష తీసుకునే భక్తులు సోమ, మంగళవారాల్లో దీక్ష చేపట్టాలని సూచించారు. అర్ధ మండల దీక్ష తీసుకునేవారు నవంబరు 14, 15 దీక్ష చేపట్టాలని తెలిపారు.




అమరావతి : కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

రైల్వే స్టేషన్ ఉన్నా.. రైళ్లేవి

- రైళ్లు ఆగక ప్రయాణికుల అవస్థలు

వినుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేరుకు వినుకొండ, శావల్యాపురంలలో రైల్వేస్టేషన్లు ఉన్నాయి. అయితే రైలు ప్రయాణం ఈ ప్రాంతవాసులకు సమగ్రంగా అందుబాటులోకి రాలేదు. ఈ స్టేషన్ల మీదగా పలు రైళ్లు వెళ్తున్నా ఆగవు. పేరుకు జంక్షన్‌గా ఉన్న శావల్యాపురం రైల్వేస్టేషన్‌లో రోజు మొత్తం కేవలం రెండు రైళ్ల మాత్రమే ఆగుతున్నాయి. భువనేశ్వర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ వినుకొండలో ఆగుతుంది. అయితే జనరల్ కంపార్ట్‌మెంట్లో కాలు పెట్టడానికి కూడా ఖాళీ ఉండదు. దీంతో అత్యవసర ప్రయాణాలు చేసే సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకున్నా నరసరావుపేట లేదా మార్కాపురం వెళ్లి ఎక్కాల్సి వస్తుందని వినుకొండవాసులు వాపోతున్నారు. ఈ రైలును వినుకొండలో నిలుపుదల చేయాలని ఏళ్లుగా డిమాండ్ ఉన్నా అటు రైల్వే అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని తెలిపారు. హౌరా- యశ్వంత్‌పూర్ వయా సత్యసాయి ప్రశాంతి నిలయం వెళ్లే రైలు, గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా వినుకొండ మీదగా రాకపోకలు సాగిస్తున్నా ఇక్కడ ఆగడంలేదు. ఈ మూడు రైళ్లకు వినుకొండ స్టేషన్లో స్టాప్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక వినుకొండ నుంచి నిత్యం బెంగళూరుకు అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రైళ్ల సౌకర్యం లేక ఎక్కువగా బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. వినుకొండ మీదగా 12 ట్రావెల్ బస్సులు నిత్యం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో నాలుగు బస్సులు వినుకొండ నుంచే బయల్దేరతాయి. ఇక వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి ఒక బస్సు బెంగళూరుకు వెళ్తుంది. అంటే బెంగళూరు సర్వీసులకు వినుకొండ ప్రాంతం నుంచి ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుసుకోవచ్చు. బస్సులతో పోలిస్తే సురక్షిత, తక్కువ ఖర్చుతో కూడిన రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తేవాలని వినుకొండవాసులు కోరుతున్నారు.



శావల్యాపురం రైల్వే జంక్షన్



వినుకొండ రైల్వే స్టేషన్



ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

36 బస్సులపై కేసులు.. రూ.2.50 లక్షల జరిమానా

- ప్రైవేటు బస్సులపై రవాణాశాఖాధికారుల ఉక్కుపాదం

నరసరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న ప్రైవేటు బస్సులపై రవాణాశాఖాధికారుల ఉక్కుపాదం మోపారు. కర్నూలు ఘటన నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రధాన రహదారులపై ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని నిబంధనలు పాటించని 36 బస్సులపై కేసులు నమోదు చేసి రూ2,50,000 అపరాధ రుసుం విధించినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్ తెలిపారు. అత్యవసర ద్వారం లేని, సీట్లు మార్పు డ్రైవర్, కంపార్ట్‌మెంట్లలో బెర్తులతో పాటు సైడ్ గ్లాసులు, ప్రయాణికుల జాబితా, అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు తదితరాలు లేని 36 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబుల్ రోడ్డుకు.. మోక్షం

- ఐదు మండలాల ప్రజలకు తప్పనున్న ఇక్కట్లు
- రూ.25 కోట్లు మంజూరుతో ఊపందుకోనున్న పనులు


క్రోసూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిధులు మంజూరు కాక గోతుల రోడ్డుతో ఐదు మండలాల ప్రజలు పడిన అవస్థలు త్వరలో తీరిపోనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో గత ఐదారేళ్లుగా వాహన చోదకులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వారి ఇక్కట్లు తీరుస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీంతో త్వరలో అమరావతి - బెల్లంకొండ ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డు పనులు తిరిగి ఊపందుకోనున్నాయి. సుమారు 50 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తయితే ఐదు మండలాల ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. 2019 సాధారణ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.వంద కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.49 కోట్లు అప్పట్లో మంజూరు చేసింది. దీంతో విజయవాడకు చెందిన వీఎస్ ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుని పనులు చేపట్టింది. ప్రారంభంలో పనులు వేగంగా జరిగాయి. అయితే జగన్ ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. రోడ్డు నిర్మాణానికి గోతులు తవ్వి ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలకు వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాల సమయంలో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. అయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ చొరవతో ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్‌కు బకాయిల చెల్లింపులతో పనులు తిరిగి ప్రారంభంకానున్నాయి.



అధ్వానంగా ఉన్న అమరావతి - బెల్లంకొండ రహదారి

దిక్సూచి

ఇండియన్ ఆర్మీలో
టెక్నికల్ ఎంట్రీ స్కీమ్



మొత్తం ఖాళీలు: 90

ఇండియన్ ఆర్మీలోని 10 ప్లస్ 2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సుల్లో ప్రవేశాల కోసం అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు. ఇందులో ఎంపికైన వారికి బీటెక్ డిగ్రీతోపాటు, సైన్యంలో లెఫ్టినెంట్ ఉద్యోగంలో చేరవచ్చు.

కోర్సు:

టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 55 కోర్సు(టీఈఎస్) - 2025 జూలై 2026

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అయితే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. దీనితోపాటు జేఈఈ మెయిన్ 2025 స్కోరు సాధించాలి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి పదహారున్నర సంవత్సరాల నుంచి పంతొమ్మిదిన్నర సంవత్సరాల మధ్యలో ఉండాలి.

వేతనం: మిలిటరీ సర్వీస్ పే కింద చదువుకునే కాలంలో స్టైపెండ్ నెలకు 15,500/- రూపాయలు లభిస్తుంది. తర్వాత 56,000/- వేతనంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి.

ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కోర్సు శిక్షణ: కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఇందులో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, బీటెక్ టెక్నికల్ శిక్షణ ఇస్తారు. మొదటి మూడేళ్లు పుణె, సికింద్రాబాద్, మావ్‌లోని ఆర్మీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది. తరవాత డెహ్రాడూన్ లోని 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో శిక్షణ కొనసాగుతుంది. ఆపై డిగ్రీతోపాటు, లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో విధుల్లోకి తీసుకుంటారు.

చివరి తేదీ: 2025 నవంబర్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి
యూసీడ్ - 2026

డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్'(యూసీడ్)- 2026 నోటిఫికేషన్ వెలువడింది. దీనిని బాంబే ఐఐటీ నిర్వహిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఐఐటీలు సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలోని బీడిజైన్ కోర్సుల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఇంటర్ పూర్తి చేసిన వారు యూసీడ్ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. 'యూసీడ్ స్కోరు వాలిడిటీ ఏడాది. వరుసగా రెండు సంవత్సరాలు మాత్రమే అభ్యర్థులు ఈ ఎంట్రెన్స్ రాయవచ్చు.

వయస్సు: దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2001 అక్టోబర్ 10 తరువాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్ల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

పరీక్ష తేదీ: 2026 జనవరి 18 **ఫలితాలు:** 2026 మార్చి 6

పరీక్ష సెంటర్లు: తెలుగు రాష్ట్రాల్లో యూసీడ్ పరీక్ష సెంటర్లు హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.uceed.iitb.ac.in/2026/

పారా మెడికల్‌లో
పీజీ, పీజీ డిప్లొమా

ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ కలిసి పీజీ, పీజీ డిప్లొమా(సెల్ఫ్ సపోర్టెడ్) కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: రెండు సంవత్సరాల కోర్సు ఇది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. కోర్సు ఫీజు 55000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 40000 రూపాయలు.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 నవంబర్ 7

ఫోన్: 7995013421, 7207953919

వెబ్‌సైట్: www.audoa.andhrauniversity.edu.in



డీఆర్‌డీఈలో అప్రెంటిస్‌షిప్

బెంగళూరులోని డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

ఖాళీల వివరాలు:

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(ఇంజనీరింగ్)- 23
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(జనరల్) - 27
- డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్ - 27
- ఐటీఐ అప్రెంటిస్‌షిప్ - 30

మొత్తం ఖాళీలు 105

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమోబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు ఉన్నాయి.

అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

వయస్సు: 18 సంవత్సరాలు పూర్తి కావాలి.

దరఖాస్తు విధానం: ఐటీఐ అభ్యర్థులు ఎన్ఏపీఎస్ పోర్టల్‌లో, ఇతరులు ఎన్ఏటీఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్వ్యూ హాజరు కావాల్సిన తేదీ: 2025 నవంబర్ 4

చిరునామా: ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.

వెబ్‌సైట్: drdo.gov.in/

SCHOLARSHIP ALERT

Mahindra Big Boss Nayi Pehchan Scholarship

Description: The Mahindra Big Boss Nayi Pehchan Scholarship 2025-26 is designed to empower children of freelance tractor mechanics by offering a scholarship of INR 6,000 annually to support their educational journey.

Eligibility:

- Children of freelance tractor mechanics.
- Aged 7 to 21 years, enrolled in school, college, or vocational courses.
- 50% marks (or equivalent) in the previous class/semester.
- Open to students across India.
- SC/ST/OBC reservations available.
- Children of Buddy4Study or Mahindra & Mahindra Ltd. employees are not eligible.

Prizes & Rewards: Students will receive a scholarship amount of INR 6000/-.

Last Date to Apply: 15-11-2025

Application mode: Online applications only

L'Oréal For Young Women in Science Program

Description: L'Oréal India offers the L'Oréal For Young Women in Science Program 2025-26 for young women who have passed Class 12 and wish to pursue higher education in scientific fields.

Eligibility: Open to female students only.

- Annual family income should not exceed INR 6,00,000.
- **UG students:** Must have secured at least 85% marks in Class 12 (Science Stream) and be pursuing an undergraduate degree in a science-related field (except final-year students).
- **PG/PhD students:** Must have secured at least 60% marks in their undergraduate course and be pursuing post-graduation (any year) in fields such as Technology, Science, Pharma, Life Sciences, Biotechnology, etc. (except final-year students).
- Students from PAN India are eligible.
- Children of L'Oréal India and Buddy4Study employees are not eligible.

Prizes & Rewards:

- **UG students:** Fixed scholarship of INR 62,500
- **PG and PhD students:** Upto scholarship of INR 1,00,000

Last Date to Apply: 03-11-2025 ***Application mode:*** Online only

Short Url: www.b4s.in/aj/LIS6

Muskaan Scholarship Program 2.0

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date: 05-11-2025 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నా పరువుకు భంగం కలుగుతోంది

● సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు



తన రూపాన్ని పోలిన ఏఐ డీప్‌ఫేక్ చిత్రాలను, వీడియోలను సృష్టించి... వాటికి అసభ్య, అశ్లీల కంటెంట్‌ను జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని హీరో చిరంజీవి శనివారం సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధనార్జనే ధ్యేయంగా నా రూపాన్ని మార్ఫింగ్ చేస్తూ, అసభ్యకరమైన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న పలు అక్రమ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ చానల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చిన కొన్ని వెబ్ లింక్స్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. 'దశాబ్దాల పాటు కష్టపడి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ఇలాంటి చర్యలతో నా పరువుకు భంగం కలుగుతోంది. కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న నన్ను కించపరిచేలా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీచపు పనులకు పాల్పడుతున్నారు. వారిని కఠినంగా శిక్షించండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

హీరో నారా రోహిత్, శిరీషల వివాహం ఈ నెల 30న జరగనుంది. ఆదివారం హల్దీ వేడుకతో పెళ్లి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషతో దిగిన ఫొటోను నారా రోహిత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



పోరాటాలే ప్రత్యేకాకర్షణగా

గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్ రెడ్డి ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనేది వర్కింగ్ టైటిల్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కథానాయకుడు గోపీచంద్, ఇతర తారాగణం పాల్గొంటుండగా వెంకట్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్‌గా నిలవనుందని యూనిట్ తెలిపింది. కాగా, మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆ పోస్టర్‌లో యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేశారు. మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో గోపీచంద్ కనిపించబోతున్నట్లు ప్రచార చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం వల్ల అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీఓపీగా వ్యవహరిస్తుండగా, అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.



లార్డ్ మార్కో?



మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కొత్త చిత్రం ఖరారైంది. 'మార్కో', 'కట్టలాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత షరీఫ్ మహ్మద్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతోందో తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. మునుపెన్నడూ పోషించని ఓ విభిన్నమైన పాత్రలో మమ్ముట్టి కనిపించనున్నట్లు షరీఫ్ తెలిపారు. దర్శకుడు, ఇతర తారాగణం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అయితే ఈ చిత్రం పేరు 'లార్డ్ మార్కో' అయి ఉంటుందని పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలిసి నెల రోజుల క్రితం కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో 'లార్డ్ మార్కో' టైటిల్‌ని రిజిస్ట్రేషన్ చేయించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. కాగా, మమ్ముట్టి నటించి, నిర్మించిన 'కలమ్ కావల్' సినిమా నవంబరు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల తర్వాతే మమ్ముట్టి కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలున్నట్లు సమాచారం.

రజనీ - కమల్ మూవీ పక్కా



రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం కాబోతోంది? దర్శకుడు ఎవరు? అనే విషయాలు మాత్రం ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. మొదట్లో ఈ ప్రాజెక్టుకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ పేరు విన్పించింది. కానీ తాను డైరెక్ట్ చేయడంలేదని ప్రదీప్ తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అన్న అనుమానాలు అభిమానుల్లో కలిగాయి. అయితే రజనీకాంత్ కూతురు సౌందర్య మాత్రం కచ్చితంగా ఈ సినిమా తెరకెక్కుతుందని అంటున్నారు. ఇటీవల ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆమె ఈ సినిమాని రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తారని స్పష్టం చేశారు. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ కలసి నటిస్తే చూడాలనే ఆశ తనకూ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి, వివరాలను నాన్నగారు త్వరలో స్వయంగా వెల్లడిస్తారు అని సౌందర్య తెలిపారు. ఆ మధ్య సైమా అవార్డుల వేడుకలో కూడా కమల్ హాసన్ ఈ విషయంపై స్పందించారు. 'ప్రేక్షకులు మా కాంబినేషన్‌ని ఇష్టపడితే మంచిదే కదా, వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మీ ముందుకు కలసి రానున్నాం' అని అన్నారు. కాగా, వీరిద్దరూ కెరీర్ తొలినాళ్లలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి హిట్ చిత్రాలతోపాటు సుమారు ఇరవైకి పైగా చిత్రాల్లో కలసి నటించారు. 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీ, కమల్ కలసి నటించలేదు.

నెపోలియన్ రిటర్న్స్



కొన్నేళ్ల క్రితం 'నెపోలియన్' చిత్రంలో 'నా నీడ పోయింది సార్...' అంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అందర్నీ ఆకర్షించిన ఆనంద్ రవి ఈసారి మరో ఉత్కంఠభరితమైన కథతో వస్తున్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కొత్త చిత్రం 'నెపోలియన్ రిటర్న్స్'. ఆచార్య క్రియేషన్స్ పతాకంపై భోగేంద్ర గుప్త నిర్మిస్తున్నారు. దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన వేడుకలో టైటిల్‌ను ఆవిష్కరించి, గ్లింప్స్ విడుదల చేశారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ 'ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నరకు పైగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి కథతో అందరి ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను పేరెంట్స్, ప్రతినిధి, నెపోలియన్, కొరమీను వంటి విభిన్న కథా చిత్రాలను తీశాను. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. 'నెపోలియన్ రిటర్న్స్'తో ఆ రెండూ వస్తాయనే నమ్మకం ఇప్పుడు కలుగుతోంది. సినిమా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంతవరకూ ఎక్కడా సినిమా రాలేదు' అని పేర్కొన్నారు. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుంది' అని చిత్ర కథానాయిక దివి అన్నారు.

లవ్ అండ్ వార్ ఇటలీలో క్లైమాక్స్‌కు







దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ గ్రాండియర్‌గా తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్, అలియాభట్ ప్రధాన తారాగణం. త్వరలో ఇటలీలో ఈ చిత్రం షెడ్యూల్ జరగాల్సి ఉంది. అయితే ఆ షెడ్యూల్‌ను రద్దు చేసి ముంబైలోనే షూటింగ్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. భారీ సెట్స్ నిర్మించి అందులో ఇటలీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే ఆ వార్తల్లో నిజం లేదని మేకర్స్ తెలిపారు. అయితే ఆ షెడ్యూల్ రద్దు కాలేదని మేకర్స్ తెలిపారు. కథానుసారం రియల్ లొకేషన్లలోనే చిత్రీకరించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో పది రోజుల షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేస్తున్నారు. అది పూర్తయ్యాక 20 రోజుల పాటు సాగే గ్రాండ్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను డిసెంబర్‌లో ఇటలీలో చేయనున్నారు. అక్కడ 45 రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసినా చివరకు 20 రోజులకు కుదించినట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆర్యన్ ప్రణయ గీతం



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఈనెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి(శ్రేష్ఠ్ మూవీస్) విడుదల చేస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'పరిచయమే...' అంటూ హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రణయ గీతాన్ని విడుదల చేసింది. సామ్రాట్ రాసిన ఈ గీతానికి జిబ్రాన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. వరుస హత్యల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రానికి హరీశ్ కన్నన్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

ప్రకృతి ఒడిలో పరుగు



అడవి మధ్యలో సాగుతున్న రన్



రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు



మూలపాడులో ట్రైమెట్రిక్స్ హ్యాపీ ఫారెస్ట్ రన్

ప్రకృతి ప్రేమికులతో ఆహ్లాదకర వాతావరణంలో కొండ కోనల సవ్వడులను ఆస్వాదిస్తూ.. పక్షుల కిలకిలరావాలు.. సీతాకోకచిలుకల సోయగాల మధ్య మధురానుభూతిని అనుభవించాలకునే ప్రకృతి ప్రేమికుల హ్యాపీ ఫారెస్ట్ రన్ అద్భుతంగా సాగింది. పర్యాటకులకు ప్రకృతి మధురానుభూతులను పంచేందుకు 'ట్రైమెట్రిక్స్' సంస్థ మూలపాడు వద్ద నిర్వహించిన ఈ ట్రయల్ రన్ ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు కొండ కోనల్లో ఆదివారం జరిగింది. అటవీ శాఖ అధికారుల సహకారంతో రేస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో 'ట్రైమెట్రిక్స్' హెడ్ కోచ్ బి.రుషిల్ యాత్రను నిర్వహించారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)





ఫారెస్ట్ రన్‌లో చిన్నారులు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన వాయిదా

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటన వాయిదా పడింది. బుధవారం రాజధాని అమరావతిలో పలు ప్రధాన బ్యాంకుల కేంద్ర కార్యాలయాల శంకుస్థాన కార్యక్రమానికి ఆమె రాజధాని అమరావతికి రానున్నట్లు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. అయితే వచ్చే మూడు రోజులు మొంథా తపాను ప్రభావం కారణంగా ఈ పర్యటనను నిర్మలా సీతారామన్ రద్దు చేసుకున్నారు. మళ్లీ షెడ్యూల్ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి కార్యాలయం తెలిపింది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల నిలుపుదల

విజయపురిసౌత్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో నాగార్జున సాగర్ కుడి కాలువకు అధికారులు నీటిని నిలుపుదల చేశారు. ముందు జాగ్రత్త చర్యగా నీటిని నిలిపివేసినట్లు కుడి కాలువ గేట్స్ డీఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. తుపాను ముప్పు తగ్గిన అనంతరం మళ్లీ నీటిని విడుదల చేస్తామని చెప్పారు. తుపాను నేపథ్యంలో కుడి కాలువ ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

305 టీఎంసీల నీటి నిల్వ..

సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 2,872, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,576, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, ఎల్ఎల్‌సీ ద్వారా 300 , మొత్తం ఔట్‌ఫ్లో 37,948 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 37,948 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0723 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్, 1 గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 24,116, టేల్ రేస్ చానల్ ద్వారా 8,703.. మొత్తంగా 32,819 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 3,3657 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానం.

డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేత

తాడేపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 52 వేల 60 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా.. అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్లు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ కాదని.. ఆర్టీసీకి పరుగులు

- కర్నూలు దుర్ఘటన నేపథ్యంలో ట్రావెల్స్‌పై ఆర్టీఏ దాడులు
- ఆర్టీసీ బస్సులకు పెరిగిన ప్రయాణికుల తాకిడి
- కిటకిటలాడిన ఎన్టీఆర్ బస్టాండు
- చెన్నైకు అదనంగా మరో రెండు సర్వీసులు



ఎన్టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ పెరిగింది. కర్నూలులో బస్సు దగ్ధం దుర్ఘటనతో ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారుల దాడులు చేపట్టారు. దీంతో ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగింది. ప్రయాణికుల రద్దీ ఈ వారం రెట్టింపయ్యింది. గుంటూరు నుంచి ప్రతి ఆదివారం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్ వంటి దూర ప్రాంతాలకు సర్వీసులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా కర్నూలులో బస్సు దగ్ధం ఘటనతో ప్రజలను ఉలికిపాటుకు గురయ్యారు. ప్రైవేటు ట్రావెల్స్ సర్వీసుల కంటే ఆర్టీసీయే మేలంటూ బస్టాండ్‌కు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. రాత్రి గుంటూరు, తెనాలి నుంచి బెంగళూరుకు వెళ్లే సర్వీసులకు ప్రయాణికులు ఫుల్ అయ్యారు. మరో వైపు గుంటూరు నుంచి చెన్నై వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసు బుకింగ్ ఫుల్ అవటంతో అదనంగా మరో రెండు సర్వీసులు చెన్నైకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక హైదరాబాద్‌కు కూడా ప్రయాణికుల తాకిడి పెరిగింది. రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) సాంబశివ పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించారు.

ఆజాద్‌కు తక్షణమే వైద్యసేవలు అందించాలి

- పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్

గుంటూరు సిటీ, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న ఝర్‌పాడ హై సెక్యూరిటీ జైలులో అక్టోబర్ 15 నుంచి నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న మావోయిస్టు ఆజాద్‌కు తక్షణమే వైద్య సేవలు అందించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ రాజకీయ ఖైదీ దున్నా కేశవరావు అలియాస్ ఆజాద్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. గత శుక్రవారం నాటికి నిరవధిక నిరాహా రదీక్ష తొమ్మిదో రోజుకు చేరుకున్న సందర్భంగా ఆజాద్‌ను భువనేశ్వర్‌లోని క్యాపిటల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం. ఆయన తనపై నమోదైన అన్ని కేసులను త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అయితే ఆయన ప్రస్తుతం కాలేయానికి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ హెపటైటిస్‌తో బాధపడుతున్నారని, దీని వల్ల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దున్నా కేశవరావుపై పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించడానికి శ్రీకాకుళం జిల్లా గత శనివారం నుంచి ఒక ప్రత్యేక కోర్టు ఏర్పాటు అవుతున్నప్పటికీ, ఒడిశాలో ఆయనకు సంబంధించిన అనేక కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్న చోట ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

జేఆర్ఎఫ్ ప్రవేశ పరీక్షలో..
వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ర్యాంక్‌లు



జీఎస్ రంగనాథ్, 2వ ర్యాంక్



వి.ప్రత్యూష, 43వ ర్యాంక్



జి.బృహతి, 20వ ర్యాంక్

బాపట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీఏఆర్-ఏఐఈఈఈ ఏజాతీయ స్థాయి పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ (ఆనర్స్ ఏజీ) 2021 బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి తెలిపారు. జీఎస్.రంగనాథ్.. ప్లాంట్ సైన్సెస్‌లో అఖిలభారత స్థాయిలో 2వ ర్యాంక్, వి.ప్రత్యూష ప్లాంట్ సైన్సెస్‌లో 43, మేడపాటి జీఎస్.సాహితి ప్లాంట్ బయోటెక్నాలజీలో 1, పి.హుస్సేన్‌ఖాన్ ప్లాంట్ బయోటెక్నాలజీలో 38, జి.బృహతి ఫిజికల్ సైన్సెస్‌లో 20, కె.మహిమ 161వ ర్యాంక్ సాధించారని వెల్లడించారు. అదేవిధంగా ప్లాంట్ సైన్సెస్, ఎంటమాలజీ, అగ్రానమిలో అనేక మంది విద్యార్థులు 10 నుంచి 50 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ప్లాంట్ సైన్సెస్‌లో 20మంది విద్యార్థులు అర్హత సాధించగా ఎంటమాలజీలో 14, అగ్రానమిలో 13, ప్లాంట్ బయోటెక్నాలజీలో ముగ్గురు, సోషల్ సైన్సెస్‌లో ఇద్దరు, ఫిజికల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్‌లో జాతీయ స్థాయిలో 200 నుంచి 900 వరకు ర్యాంకులు సాధించి భారతదేశంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాలైన ఐఏఆర్ఐ న్యూఢిల్లీ, ఐఏఆర్ఐ రాంచి, ఐజీకేవీ ఛత్తీస్‌ఘడ్, రాయపూర్, టీఎన్ఏయూ కోయంబత్తూరు, ఐవీఆర్ఐ ఉత్తరప్రదేశ్, యూ ఏఎస్ ధార్వాడ్, ఎస్కే యూఎస్‌టీ కశ్మీర్‌లో సీట్లు పొందినట్లు ఆమె తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులను ఆమె అభినందించారు.

7 నుంచి వీవీఐటీయూలో బాలోత్సవ్

- ప్రచార ప్రతులు ఆవిష్కరించిన చాన్సలర్ విద్యాసాగర్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలోత్సవ్ -2025 వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ ప్రాంగణంలో వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకునిర్వహించనున్నట్లు వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం గుంటూరులో బాలోత్సవ్ సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆయన ఆవిష్కరించారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవ్ ఒక మంచి వేదికన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, శాక్ విద్యార్థులు బాలోత్సవ్‌లో పాల్గొనే చిన్నారులకు సహకారం అందిస్తారని తెలిపారు. బాలోత్సవ్ విద్యార్థి సంధానకర్త టి.నవ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు 20 అంశాలు 60 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. వక్తృత్వం, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం వంటి సాంస్కృతిక అంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం balotsav.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఎంట్రీ ఫాంలను పూర్తిచేసి పోస్టు చేయొచ్చని లేదా వెబ్‌సైట్‌లోని గూగుల్ ఫాంను పూర్తిచేసి అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బాలోత్సవ్ సంధానకర్త నందిరాజు శివరామకృష్ణను 73862 25336 నంబరుకు సంప్రదించాలన్నారు.

మొంథా తుపానుపై రైల్వే సన్నద్ధత ఏదీ?

- ఇప్పటి వరకు ఏర్పాటు చేయని హెల్ప్‌లైన్ నంబర్లు

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకపక్క మొంథా తుపాను సముద్ర తీరానికి కదులుతోందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ.. రైల్వే శాఖ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్ట లేదు. కనీసం హెల్ప్‌లైన్ నంబర్లు కూడా ప్రకటించ లేదు. తుపాను ప్రభావం ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ.. ప్రతిస్పందనగా రైల్వే శాఖ నుంచి ఎలాంటి బులెటిన్‌లు కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదు. మొంథా తుపాను కాకినాడ వద్ద తీరం దాటొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను వల్ల గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అలానే 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. గతంలో వచ్చిన తుపాన్ల కంటే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని కూడా హెచ్చరిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదివారం సాయంత్రం వరకు డివిజన్ కార్యాలయాలకు ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాచారం. ఐఎండీ చెబుతున్నట్లు భారీ వర్షాలు కురిస్తే రైల్వేస్టేషన్లు, రైలు మార్గాల్లోకి వర్షం నీరు చేరి నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. వాగుల్లో నీటి ప్రవాహాలు పెరిగి రైలు మార్గాలు దెబ్బతినే అవకాశాలుంటాయి. దీంతో రైలు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ముందస్తు సమాచారం లేకుండా రైళ్ల రద్దు, దారి మళ్లింపులు చేస్తే ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. విశాఖపట్నం - చెన్నై మార్గం అత్యంత రద్దీ రూట్లలో ఒకటిగా ఉంది. ఈ మార్గంలో గుంటూరు నుంచి విశాఖపట్టణం వైపునకు నిత్యం ఫలక్‌నుమా, జన్మభూమి, విశాఖ, ప్రశాంతి, అమరావతి(షాలిమార్), ఉదయ్, సింహాద్రి వంటి రెగ్యులర్ రైళ్లు ప్రయాణిస్తాయి. చెన్నై మార్గంలో నిత్యం చెన్నై, జనశతాబ్ది, వందేభారత్, నారాయణాద్రి, శబరి ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో మొంథా తుపానుని రైల్వే శాఖ తేలికగా తీసుకోకుండా తగిన సన్నద్ధత చర్యలు చేపట్టాలని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఓవరాల్ ఛాంపియన్లుగా తూర్పుగోదావరి, విశాఖ

- ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ విజేతలతో జబీన్, శ్రీఅనిత, ఉన్నం ఝాన్సీరాణి

దుగ్గిరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటుగా, క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ జబీన్ పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మెడల్స్ ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జబీన్, శ్రీఅనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. యార్డు చైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగావకాశాల్లో క్రీడాకారులకు ఒకశాతంగా ఉన్న కోటాను 3 శాతానికి పెంచిందన్నారు. మంత్రి లోకేశ్ క్రీడాకారుల కోసం అనేక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సాహిస్తున్నారని కొనియాడారు. అండర్-19 విభాగం (బాలికలు) ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పుగోదావరి జిల్లా, రన్నర్‌గా పశ్చిమగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. బాలుర అండర్- 19 విభాగం ఛాంపియన్‌గా విశాఖపట్నం జిల్లా, రన్నర్‌గా కడపజిల్లా జట్లు నిలిచాయి. అండర్-17 (బాలికలు) ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పు గోదావరి, రన్నర్‌గా పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పుగోదావరి, రన్నర్‌గా కడప జట్లు ప్రతిభను చాటుకున్నాయి. మొత్తం పది కేటగిరీల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన సుమారు 450 మంది పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగ శిరీష, మాజీ కార్యదర్శి పీడీ మెల్లెంపూడి రవి, హెచ్ఎం బీవీ కృష్ణారావు, బి.శ్రీనివాసరావు, సీహెచ్ కొండయ్య, వి.రమేష్‌బాబు, బి.భాస్కరరావు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తికి సీఎం చంద్రబాబు రాక

- ఎమ్మెల్యే జూలకంటి తనయుడి వివాహ రిసెప్షన్‌కి హాజరు
- సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ కృష్ణారావు
- పాల్గొననున్న మంత్రి నారా లోకేశ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

మాచర్ల/వెల్దుర్తి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తికి సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ రానున్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు వెల్దుర్తిలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురు దాదాపు పది ఎకరాల్లో పార్టీ శ్రేణులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదివారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. రిసెప్షన్, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. జేసీ సూరజ్ గనోరే కూడా ఏర్పాట్లను పరిశీలించారు. వీరి వెంట గురజాల ఇన్‌చార్జి వెంకటరమణ, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు ఉన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాన్ని జాగిలాలతో బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు జరిపింది. హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. హెలిప్యాడ్ నుంచి రిసెప్షన్ ప్రాంతానికి సీఎం చేరుకునేందుకు కార్‌వాన్ ఏర్పాటు చేశారు. ఎస్పీ, ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 27 మంది సీఐలు, 52 మంది ఎస్ఐలు, 750 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ యువనేతలు అక్కిరెడ్డి, చిరంజీవిరెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. 50 వేల మంది రిసెప్షన్‌కు హాజరుకావొచ్చని భావిస్తున్నారు. ప్రత్యేక వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.

పకడ్బందీగా భద్రతా చర్యలు

సీఎం పర్యటన నేపథ్యంలో అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం మాచర్లలోని మానుకొండ కల్యాణ మండపంలో పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని డ్రోన్లు, కెమెరాలతో బందోబస్తు నిర్వహించనున్నామన్నారు. అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, ఎస్‌బీ సీఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మాచవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచవరం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. అదే విధంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో ఆయా గ్రామాల్లో డ్యూటీలు కూడా వేయటం జరిగిందన్నారు. వారికి కేటాయించిన డ్యూటీల్లో తప్పనిసరిగా హాజరై సమాచారాన్ని మండల కేంద్రానికి చేరవేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో సమయం ప్రకారం అధికారులు ఉండి తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు మండల కేంద్రానికి చేరవేయాలని తహసీల్దార్ సూచించారు. కంట్రోల్ రూమ్ నెం.7093965985కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

ముప్పాళ్ళ మండలంలో..

ముప్పాళ్ళ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నగేశ్ తెలిపారు. పల్నాడు జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ప్రజలు అవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు.

● రాజుపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా తీవ్ర వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామ పంచాయితీలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసి వారి వారి సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు.

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ

దాచేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లి గ్రామం కస్తూర్బా పాఠశాలలో కూటమి నేతల ఆధ్వర్యంలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదివారం పాఠశాలలో టీడీపీ నాయకులు తోట వెంకటేశ్వర్లు, నెల్లూరి రామకోటయ్య, కోట శాయన్నల ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, తోట నాగేశ్వరరావు, టంటం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

మాచవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల కలెక్టర్ ఆదేశాల మేరకు మాచవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఎంఈవో శ్రీధర్ ఆదివారం తెలిపారు.

● బెల్లంకొండ/క్రోసూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తీవ్ర వాయుగుండం నేపథ్యంలో సోమవారం పాఠశాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు ఎంఈవోలు రాజకుమారి, జి.కృష్ణ, ఎం.గణేష్ తెలిపారు. తమ మండలాల్లోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు చెప్పారు.

● మాచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మాచర్ల నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు విద్యార్థులు పాఠశాలలకు రాకుండా వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు.

గోశాలలో సత్యనారాయణస్వామి వ్రతాలు

పిడుగురాళ్ళ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శ్రీకారుణ్య సాయి గోసేవ గోసంఘం 13వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

బెల్లంకొండలో వాహనాల తనిఖీ

బెల్లంకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బెల్లంకొండలో స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ఉండాలని సూచించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనిఖీల్లో సిబ్బంది షణ్ముక్, ఎల్ వెంకటేశ్వరరావు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో 42.96 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 12,065 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది విద్యుత్ ఉత్పత్తి ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 41,240, మొత్తం 58,240 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

పెదకూరపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ దుడ్డు రామకృష్ణ అన్నారు. పెదకూరపాడులో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎస్ఎస్‌పీ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. నవంబరు 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దాసరి నాగయ్య, కంచర్ల జాన్‌బాబు కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు హేమవరపు జీవన్, వెంకటస్వామి, అచ్చయ్య, కృష్ణారావు, కిరణ్ పాల్గొన్నారు.

అన్నదానం

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్రశాలోని మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వరుసగా ఐదో రోజు భక్తులకు అన్నదానం చేశారు. దాతలు ఎనిగండ్ల నరసింహారావు, సైదులు యాదవ్, దొండపాటి వెంకయ్య, ఫణిచంద్ర, నాగేశ్వరరావు దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సత్రశాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్య, జెట్టిపాలెం టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పత్తి రైతుల్లో ఆందోళన

● అధిక వర్షాలతో పుచ్చుతున్న పత్తి కాయలు


దాచేపల్లి: ఆరబోసిన పత్తికాయ గుల్లలు

క్రోసూరు/రెంటచింతల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలతో పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎడతెరిపి లేనివర్షాలతో ఇప్పటికే చాలా భాగం పత్తిపంట దెబ్బతింది. అధికతేమవల్ల చెట్ల పైనే పత్తికాయలు కుళ్ళిపోతున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పత్తికాయలు నేలరాలిపోవటం, రంగుమారుతున్నాయి. కలుపు పెరిగి పెద్దసమస్యగా మారింది. అధిక తేమశాతంతో పంట ఎర్రబారుతుందని రైతులు వాపోతున్నారు. సబ్‌డివిజన్‌లో ఈ సంవత్సరం సాధారణంకంటే అధికంగా 18,140 హెక్టార్లలో రైతులు పత్తిపంట వేశారు. ఎకరాకు రూ.50నుంచి రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ముందస్తుగా వేసిన పత్తిపంటలో ఇప్పటివరకు రెండునుంచి మూడు క్వింటాళ్ళ పత్తి మాత్ర మే దిగుబడి వచ్చింది. ఈక్రమంలో తుఫాన్ హెచ్చరికలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

● దాచేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విచ్చుకున్న పత్తి కాయల్లో వర్షపు నీరు చేరి కాయలు పుచ్చిపోవటం, పత్తి రంగు మారటం జరుగుతుంది. అధిక వర్షాలతో పండిన పత్తి కాస్త రంగు మారటం, కాయలు పుచ్చులుకావటం, పూత, పిందెలు రాలటం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ఇప్పటికే ఆర్థిక నష్టాలతో ఉన్న రైతులు గత రెండేళ్ల నుంచి పంట పొలాలను సాగు చేయకుండా వదిలివేయటం, సాగు చేసిన భూములకు కూడా కౌలు ధరలు సగానికి తగ్గించి కౌలు చెల్లించి పంటలను సాగుచేస్తున్నారు. కొంతమంది రైతులు బోర్ల కింద మే నెలలోనే పత్తి పంటలను సాగు చేశారు. ఆ పంట కాయ పగిలి పంట చేతికి వస్తున్న తరుణంలో వర్షాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. పొందుగుల, రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, వెంకటాపురం, మాదినపాడు, తంగెడ, ముత్యాలంపాడు గ్రామాలకు నష్ట తీవ్రత అధికంగా ఉంది. గత ఏడాది ఐదు వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట ఈ ఏడాది 3500 ఎకరాలకే పరిమిత మైంది.


క్రోసూరు: భారీ వర్షాలకు ఎర్రబారి దెబ్బతిన్న పత్తి పైరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పెదకూరపాడు నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ఫోన్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ తగ్గే వరకు స్థానిక నాయకుల సహకారంతో సహాయ కార్యక్రమాలను చేపట్టాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటంతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆయన అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి

పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కృషి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం టీడీపీ నేతలతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు ముఖ్యమైన అమరావతి -బెల్లంకొండ రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేయించటంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అర్తిమళ్ల రమేష్, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నేతలు మేదరమెట్ల సౌమిత్‌చౌదరి, మద్దినేని వెంకటసత్యనారాయణ, చెన్నుపాటి బుల్లిబాబు, కొండవీటి ప్రసాదు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుకు ఉపాధి హామీ


గణపవరం గ్రామంలో సాగవుతున్న పశుగ్రాసం

రాజుపాలెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద శాతం రాయితీతో పశుగ్రాసం పెంచేందుకు అనుమతులు ఇస్తోంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంది. ఐదెకరాల్లోపు భూమి కలిగిన చిన్న సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ వారు అర్హులు. పశు వైద్యాధికారి లేదా ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడి దరఖాస్తు చేసుకోవాలి. 10 సెంట్ల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేస్తే రూ. 6,559, 20 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేస్తే రూ. 13,197, 30 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేస్తే రూ19,795, 40 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేస్తే రూ. 28,788, 50 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేస్తే రూ. 32,992 రైతుకు ఇవ్వనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. పాడి పశువులకు పశుగ్రాసం తగినంత లభిస్తుందని, పాల ఉత్పత్తి పెరిగి రైతులకు చేదోడుగా ఉంటుందని రాజుపాలెం ఏపీవో వేంకటేశ్వర్లు చెప్పారు. పశు పోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మాలధారులకు సద్ది ఏర్పాటు

కారంపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం మాలధారులకు సద్ది ఏర్పాటు చేశారు. మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కోదాటి చంద్రశేఖర శర్మ, ఉమా దంపతులు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉమామహేశ్వరశర్మ, వేదాంతశర్మలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

కారంపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆర్యవైశ్య కార్తీక మాస వన సమారాధన కమిటి ఆధ్వర్యంలో రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదివారం నిర్వహించారు. అలాగే వనసమారాధన సందర్భంగా రెండు గ్రాముల బంగారపు రూపుతో ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదాన్ని శ్రీవీరబ్రహ్మేంద్ర ఆటో ఎంప్లాయిస్ ఫైనాన్స్ దేవిశెట్టి మల్లికార్జునరావు, జక్కా శ్రీనివాసరావు రూ. 70,116లకు కైవసం చేసుకున్నారు.

నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ

దుర్గి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదివేషు నాయుడు పర్యవేక్షించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి : ఈవో

గురజాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని దైద శ్రీఅమరలింగేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. దేవాలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఆవుల భాస్కర్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు బైరాపట్నం రామకృష్ణ, మునగోటి శ్రీనివాసరావు

అచ్చంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గసభ్యులు బైరాపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మాదిపాడు గ్రామంలో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. సీపీఐ నేతలు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిపాడు శాఖ కార్యదర్శి ఎస్‌కే సుభానీ, సీహెచ్ శ్రీనివాసరావుతో పాటు మునగోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు వైద్యశాల హౌస్‌ఫుల్

● ప్రైవేటు ఆస్పత్రుల సమ్మె ప్రభావం

సత్తెనపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్యశాల కింద ప్రభుత్వం నుంచి బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ సంఖ్య పెరిగినట్లు సిబ్బంది చెబుతున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నెలకు 120 ప్రసవాలు చేయాల్సి ఉండగా ఈ నెల 25వ తేదీ నాటికే 136 ప్రసవాలు జరిగాయి. వైద్యశాలలోని ప్రసూతి విభాగం పడకలన్నీ నిండిపోయాయి. గతంలో ఎన్‌టీఆర్ వైద్యశాల కింద ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రి బాట పడుతున్నారు.


ఏరియా వైద్యశాలలో ప్రసూతి వార్డు

రెవెన్యూ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర


మొక్కలు నాటుతున్న సేవా సమితి సభ్యులు

మాచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయ పరిసరాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం మొక్కలను నాటారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని గోవిందరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు హరిబాబు, వైనాగ శంకర్‌రెడ్డి, సీహెచ్ వినయ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, వెంకయ్య, శ్రీనివాసరావు, అజయ్‌కృష్ణ, రాజేశ్వరి, సీహెచ్ రుక్మిణి, సైదమ్మ, ప్రభావతి, నారాయణమ్మ, సురేంద్ర, రామాంజి, రాయప్ప, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వివేకా కృష్ణారెడ్డికి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని రెవెన్యూ కల్యాణమండపంలో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డును ఎస్‌పీఎల్‌టీవో ఆధ్వర్యంలో వివేకా కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కెఎస్.లక్ష్మణరావు ఆదివారం బహూకరించారు. ఎస్‌పీఎల్‌టీవో అధ్యక్షుడు డాక్టర్ నాగయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్ హుస్సేన్, జేవీవీ అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, కౌండిన్య ఎడ్యుకేషన్ అధ్యక్షుడు వీవీ నారాయణ, దేశవ్యాప్తంగా అవార్డును పొందిన 90 మంది పాల్గొన్నారు.


వివేకా కృష్ణారెడ్డికి అవార్డునిచ్చి సత్కరిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) నాగులపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో నాగేంద్రుని పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానంగా బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగేంద్రుని పుట్టలో పాలుపోసి పూజలు నిర్వహించారు.


నాగేంద్రుని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

శిథిలావస్థలో నకరికల్లు మండల విద్యావనరుల కేంద్రం

నకరికల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని మండల వనరుల కేంద్రం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. గదిలో వర్షపు నీరు కారుతోంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందజేసే పుస్తకాలు ఇక్కడ నిల్వ ఉంచటంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షానికి తడిచి పాడైపోతున్నాయి. నకరికల్లు-1, 2 ఎంఈవోలు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్ ఇక్కడి నుంచి విద్యాశాఖ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఈ భవనం శిథిలావస్థకు చేరటంతో విద్యాశాఖ అధికారులు భయంభయంగా కాలం వెళ్ళదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.


నకరికల్లులోని మండల వనరుల కేంద్రం


నీరు లీకవుతున్న మండల విద్యా వనరుల కేంద్రం

ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు వివరించండి

సత్తెనపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిందని చెప్పారు. నాయకులంతా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, బండారుపల్లి నరసింహారావు, రావిపాటి నానయ్య, మందడి కాళిప్రసాదు, సయ్యద్ పెద కరిముల్లా, సోలానంది, ఆళ్ళ అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మిక చట్టాలను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ కార్మికులను మోసం చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం పిడుగురాళ్లలో పల్నాడు జిల్లా రెండవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను అణచివేసి కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయడం లేదని, కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ, వేతనాల పెంపు జరగటం కోసం కార్మికులు పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. మహాసభల సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బండ్ల మహేష్, ఎస్.ఆంజనేయులునాయక్, ఇతర కార్యవర్గసభ్యులను నియమించారు. ముందుగా సీపీఐ, సీపీఎం నాయకులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు విజయకుమార్, యేపూరి గోపాలరావు, తెలగపల్లి శ్రీను, శివకుమారి, మల్లేశ్వరి, ప్రసన్న, శాంతమణి, సిలార్, పోతురాజు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, బత్తుల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



ఆంధ్రా సిమెంట్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్‌షిప్ పంపిణీ

దాచేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సిమెంట్ ప్రాంగణంలో సాగర్ గ్రూపు ఫౌండేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి వీరారెడ్డి జయంతి వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం, చదువులో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆదివారం మండలంలోని గామాలపాడు శివారులోని ఆంధ్రా సిమెంట్ లిమిటెడ్‌లో సాగర్ సిమెంట్ ఫౌండర్ చైర్మన్ తిమ్మిరెడ్డి వీరారెడ్డి 91వ జయంతి వేడుకలతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 85 మంది ఉద్యోగులు, కార్మికులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రాణాన్ని కాపాడుతుందని వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2024 - 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన మొదటి, రెండు, మూడు విద్యార్థులు రూ 5.40 లక్షల విలువైన చెక్కులు, మెమొంటో, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో దాచేపల్లి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, హెచ్‌ఆర్‌సీఎం, మణి ప్రసాదు, శంకర్ నారాయణరెడ్డి, రామకృష్ణ, భరత్ భూషణ్, మల్లిఖార్జున శాస్త్రి, మహేంద్రవర్మ, మనోజ్ కుమార్, నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెంటచింతలలో సీసీ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యం అధ్వాన్నం

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని రెండు ప్రార్థనాలయాల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం వాసనకు ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. ఆ సీసీ రోడ్డుకు సమీపంలోని కుటుంబాల వారంతా తమ ఇళ్లల్లోని చెత్తనంతా అక్కడ పడేస్తున్నారు. ఆ చెత్త నుంచి వచ్చే వాసన భరించలేకుండా ఉందని పాదచారులు, గృహాల వారు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ వారు తక్షణమే స్పందించి ఆ చెత్తను శుభ్రం చేసి, ఇకపై అక్కడ చెత్త వేయకుండా అక్కడి ప్రజల్లో చైతన్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఫిజియోథెరపీ పరికరాల అందజేత

మాచర్ల రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మందాడి రోడ్డులో గల సూర్యకిరణ్ ప్రత్యేక పాఠశాలకు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు మురహరిరావు, కల్పనాదేవి దంపతులు రూ. 30 వేల విలువైన ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. ఆదివారం పాఠశాల డైరెక్టర్ జనార్దన్, ఫిజియోథెరపీ ట్రైనర్ ప్రత్యూషలకు వాటిని అందించారు. రోటరీ క్లబ్ జిల్లా డైరెక్టర్ ఇక్కుర్తి శంకర్, లవ్ అండ్ లాఫ్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ మరో రూ. 20 వేలను అందించేందుకు ముందుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా 3150 డిసీజెస్ ప్రివెన్షన్ చైర్మన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల అడిషనల్ ప్రొఫెసర్ నాగరాజు, క్లబ్ సీనియర్ సభ్యుడు చెరుకూరి నరసింహారావు, కేపీ.సిద్ధంరాజు, నాగార్జునరెడ్డి, నిమ్మగడ్డ సురేఖ, కర్నాటి శ్రీనివాసరావు, డాక్టర్ మూడావత్ దశరథ్‌నాయక్, పఠాన్ నాగూర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ పరికరాల పంపిణీ కార్యక్రమంలో వైద్యులు

15 మంది జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్, అర్బన్ పోలీసులు ఆదివారం వేర్వేగా నిర్వహించిన దాడులలో పేకాట (కోత ముక్క) ఆడుతున్న 15మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామ డంపింగ్ యార్డు సమీపంలో రూరల్ ఎస్‌ఐ జి.అనిల్ కుమార్ 9మందిని అదుపులోకి తీసుకుని రూ.13,350 లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పరిధిలో పురుషోత్తపట్నం అడ్డరోడ్డు వద్ద ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను టౌన్ ఎస్‌ఐ చెన్నకేశవులు అదుపులోకి తీసుకుని రూ.4,600లు స్వాధీనం చేసుకున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాతావరణ శాఖ మొంథా తుఫాన్ హెచ్చరికల కారణంగా 27వ తేదీన నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం తెలిపారు. ప్రజలు గమనించాల్సిందిగా కోరారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

యడ్లపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు మండల విద్యా శాఖాధికారి ఎం.నాగరత్నం మండలంలోని అన్ని విద్యా సంస్థలకు ఆదివారం ఆదేశాలు జారీచేశారు. విద్యార్థుల భద్రత, ప్రభుత్వ సూచనల మేరకు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ముందుస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా తుఫాను ప్రభావిత ప్రాంతాలలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిందన్నారు. ప్రభుత్వ సూచనలను, ఆదేశాలను నూరుశాతం అమలు చేయాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా కుంకలగుంట వాసుల వనభోజనాలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో కుంకలగుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 16వ కుంకలగుంట కార్తీక వన భోజనాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన డాక్టర్ కిష్టంశెట్టి ప్రియాంక, ఉద్యోగోన్నతి పొందిన మద్దూరి వెంటేశ్వరరెడ్డి, జవ్వాజి శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగి ముక్కంటి సాంబయ్య తదితరులను సత్కరించారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, గౌరవ సలహాదారు కొల్లి బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ లమహబూబ్ సుధాని, అర్వపల్లి హరనాద్ బాబు, ఎంపీటీసీ బ్రహ్మారెడ్డి, మస్తాన్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ బ్రహ్మనాయుడు మృతి

చిలకలూరిపేట, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు సర్కిల్ పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ గా విధులు నిర్వహిస్తున్న మేడికొండూరు బ్రహ్మనాయుడు (56) అనారోగ్యంతో చిలకలూరిపేట క్రిస్టియన్‌పేటలో ఆదివారం మృతి చెందారు. మరణ వార్త తెలుసుకున్న పెదనందిపాడు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ, సిబ్బంది చిలకలూరిపేటకు వచ్చి బ్రహ్మానాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బ్రహ్మనాయుడు అంత్యక్రియలలో మంగళగిరి స్పెషల్ బెటాలియన్ సిబ్బంది అధికారికంగా గౌరవ వందనం చేశారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

నరసరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాకుమాను బజారు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాసు కన్వెన్షన్ హాల్‌లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గోపూజ, ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన 30జంటలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఆశీర్వవచనాలు అందజేశారు. అనంతరం 8000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ కొత్త పెద్దన్న, మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, పూరా భాస్కరరావు, గట్టుపల్లి సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, వనమా సాంబశివరావు, మద్ది రామ బ్రహ్మానందరావు, బత్తుల మురళి ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముక్కెళ్ళపాడులో వైద్య శిబిరం

నూజెండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కెళ్ళపాడులో గ్రామ సర్పంచ్ సింగంశెట్టి వెంకటబాలప్రసాదు ఆధ్వర్యంలో విజయవాడ స్వచ్ఛ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో గుండె జబ్బుల నిర్ధారణకు ఈసీజీ, టూడీ ఏకో పరికరాలతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి జ్వాలసాయి, డాక్టర్ సతీష్, ఎంపీటీసీ చంద్ర రామకృష్ణ, సీహెచ్‌వో వీరనారాయణ, సీహెచ్‌ఏ సురేష్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బి.రామలింగయ్య, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో శామ్యూల్‌కు టీడీపీ నాయకుల నివాళి

ఈపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ముప్పాళ్ళ గ్రామానికి చెందిన వీఆర్వో పచ్చల శామ్యూల్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళిలర్పించిన వారిలో ఈపూరు సొసైటీ అధ్యక్షుడు విడపలపాటి హనుమయ్య, టీడీపీ నాయకులు పులుకూరి వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ కారణంగా సంభవించే ఆస్తి, ప్రాణ నష్టాలు తగ్గించేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ సమయంలో ఎవ్వరూ బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. అధికారులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఇచ్చే సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం కంట్రోల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. తుఫాన్ తీవ్రత, సహాయక చర్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆంజనేయులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సురక్షా యాప్‌పై అవగాహన

బొల్లాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం వినియోగాన్ని అరికట్టేందుకు మండల కేంద్రమైన బొల్లాపల్లిలో జరిగిన ఏపీ ఎక్సైజ్ సురక్షా మొబైల్ యాప్‌పై అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి మద్యం సీసాపై క్యూఆర్ కోడ్‌ను వినియోగదారులు ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌లో స్కాన్‌చేసి తనిఖీ చేసుకోవాలన్నారు. దీంతో కల్తీ మద్యాన్ని గుర్తించటం, అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. కల్తీ మద్యం గురించి వినిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో 32వేల మంది కల్తీ మద్యం వల్ల చనిపోయారని, జగన్‌రెడ్డి ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెంలో 27మంది ఒకేసారి కల్తీ మద్యం తాగి చనిపోతే కనీసం పోస్టుమార్టం కూడా నిర్వహించ లేదన్నారు. కల్తీ మద్యం వల్ల రూ.3,500 కోట్లు కుంభకోణం జరిగిందని, తీగ లాగితే తాడేపల్లి జగన్ పేరు వినపడుతోందన్నారు. ఎక్కడైనా కల్తీ మద్యం ఉన్నట్లయితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమానాయక్, దాసరి కోటేశ్వరరావు, పరిటాల రామచంద్రయ్య, హనుమా నాయక్, ఎలిశెట్టి రంగయ్య, జనసేన నాయకులు హనుమా నాయక్, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



సురక్షా యాప్ పనితీరును పరిశీలిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి

▶▶ ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్ కమిటీ చైర్మన్ సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డు చైర్మన్ల సమావేశం ఆదివారం నరసరావుపేట మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పల్నాడు జిల్లా మార్కెట్ యార్డు కమిటీ అధ్యక్షుడిగా నరసరావుపేట మండలం మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మార్కెట్ యార్డు కమిటీలను ఏర్పాటుచేసి, వాటిని బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆదివారం పల్నాడు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పూనాటి శ్రీనివాసరావు ఎన్నికవడం సంతోషకరమన్నారు. ఈ కమిటీ రైతుల ప్రయోజనాల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా, జిల్లా మార్కెట్ యార్డు కమిటీలు రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయడం, వ్యవసాయ పరికరాలను అందజేయడం, గ్రామీణ ప్రాంతాల్లో లింకురోడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు, సమాచారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్త మార్కెట్ యార్డు చైర్మన్ల కమిటీ ఏర్పాటు పూర్తయిన వెంటనే, కమిటీలకు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 12 మార్కెట్ యార్డులకు గాను 10 మార్కెట్ యార్డులకు చైర్మన్లను నియమించారు. సమావేశంలో పల్నాడు జిల్లాలోని 10 మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన పూనాటి శ్రీనివాసరావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌లు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

పేద ప్రజలకు ఆసరా సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద ప్రజలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేటలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 14 మందికి రూ.8,16,014లు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16నెలల్లో దాదాపు రూ.8కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె.నాగజ్యోతి, బి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేటలో అధ్వానంగా పారిశుధ్యం

వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి





నరసరావుపేటలో అధ్వాన్నంగా ఉన్న చెత్తను, గోతులతో ఉన్న రహదారిని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ నుంచి సంవత్సరానికి 23లక్షలు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్లపై గుంతలమయమైనా పూడ్చటం లేదన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీలో కోట్ల రూపాయల డబ్బులు ఉన్నప్పటికీ రోడ్ల మరమ్మతులు చేపట్టటం లేదని విమర్శించారు. మల్లమ్మ సెంటర్లో నడవలేని స్థితిలో రక్తం కారుతూ పడి ఉన్న గోవును వైద్యశాలకు తీసుకువెళ్లి, ఆవుకు చికిత్స చేయించారు. మల్లమ్మ సెంటర్లోని ట్రాఫిక్ సిగ్నల్స్ గత ఆరు నెలలుగా పనిచేయడం లేదని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ కంట్రోల్ చేసినప్పటికీ, ట్రాఫిక్ సమస్య తీరటం లేదని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యపై అనేకసార్లు ట్రాఫిక్ ఎస్‌ఐ, సీఐలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా ఉందన్నారు. ఎమ్మెల్యే ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నా ఈ సమస్యపై దృష్టి సారించపోవటం దారుణమని విమర్శించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



మెగా వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

బొల్లాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ సౌజన్యంతో రాయపాటి మమత, డిప్యూటీ మేనేజర్ బిజినెస్ యూనిట్ యలవర్తి కార్తీక్ చౌదరి, ఆస్టర్ రమేష్ హాస్పటల్ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించటంపై హాస్పటల్ యాజమాన్యాన్ని, డాక్టర్లను అభినందించారు. కస్తూర్బా పాఠశాల అసిస్ట్ విద్యార్థులు 10వ తరగతిలో స్టేట్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.2లక్షలు, జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన వారికి లక్ష రూపాయలు శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేయటం జరుగుతుందన్నారు. కాగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్య భాగ్య కార్డుల ద్వారా రమేష్ హాస్పటల్‌లో 50శాతం రాయితీపై వైద్యం చేయటం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో 350మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులు గల మరో 30 మందిని గుంటూరుకు రిఫర్ చేశారు. వైద్య శిబిరంలో ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్యులు బత్తిన బాలభాస్కరరావు, రావిళ్ళ నీరేన్, యలవర్తి రాకేష్ కిరణ్, కాట్రగడ్డ చైతన్య, నల్లబోతు కిరోణ్ రతన్, దాసరి వసంత, అత్తోట మహేష్ చౌదరిలు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ సుధాకర్, ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన ర్యాలీ

బొల్లాపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లిలో వరల్డ్ హార్ట్ ఎటాక్ అండ్ బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్, ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాల అసిస్ట్ విద్యార్థులతో బొల్లాపల్లిలో హార్ట్ స్ట్రోక్‌పై జెండా ఊరి ర్యాలీ నిర్వహించారు. గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాల నివారణ చర్యలను వివరిస్తూ ప్లే కార్డులు ర్యాలీలో ప్రదర్శించారు. ర్యాలీలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమా నాయక్, ఎలిశెట్టి రంగయ్య, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, బొల్లాపల్లి కోటేశ్వరరావు, కందుల కోటేశ్వరరావు, షేక్ ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్స్ జోన్ సోషల్ కార్యక్రమం

వినుకొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో చిలంకూరి జోన్ సోషల్ కార్యక్రమం పట్టణంలోని శ్రీగుంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానం వద్ద శనివారం రాత్రి జరిగింది. కోటేష్ శారదల జోన్ సోషల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గుడిపాటి వెంకట లక్ష్మీ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేసీజీఎఫ్, వీకేఎస్‌వీ గురించి, వాసవి క్లబ్స్ ఇంటర్ నేషనల్ పథకాల గురించి సభ్యులు వివరించారు. కార్యక్రమంలో చిలంకూరి కోటేశ్వరరావు, శారద మాట్లాడుతూ వాసవి క్లబ్ వినుకొండ వాసవి వనిత క్లబ్ వినుకొండ వాసవీ యూత్ క్లబ్ వినుకొండ వాసవి క్లబ్ వైభవం, వెల్లటూరు ఈ నాలుగు క్లబ్స్‌కు సూపర్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్స్ బెస్ట్ సెక్రటరీ అవార్డ్స్ బెస్ట్ ట్రెజరర్ అవార్డ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ సీనియర్ నాయకులు బెల్లంకొండ వెంకట లక్ష్మీ ప్రసాద్, కె.విజయలక్ష్మి, మండవ కిరణ్, టి.బ్రహ్మం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో 42.96 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 12,065 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 41,240, మొత్తం 58,240 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యూసఫ్ అలీకి ఘన సత్కారం

చిలకలూరిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన లక్కీ రోడ్డు లైన్స్ అధినేత యూసఫ్ అలీ సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఆదివారం స్థానిక ముస్లిం కమ్యూనిటీ హాలులో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫానీ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా పాల్గొన్నారు. కార్యక్రమంలో సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గొలుసు అదృశ్యం.. ఆచూకీ కనుగొన్న పోలీసులు

వినుకొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగపంచమి సందర్భంగా బోసు బొమ్మ సెంటర్‌లోని శివాలయంలో పూజలు చేసిన మహిళ మెడలో బంగారపు గొలుసు పోవటంతో ఓ మహిళ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. పట్టణంలోని లాయర్‌స్ట్రీట్‌కు చెందిన దారా మౌనికలక్ష్మి భర్త మల్లికార్జునరావుతో కలిసి శివాలయంలోని పుట్టలో పాలు పోసేందుకు వెళ్లారు. పూజ అనంతరం మెడలో గొలుసు కనిపించకపోవడంతో వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ ప్రభాకర్ ఎస్‌ఐ బాలకృష్ణకు కేసు అప్పగించారు. సిబ్బంది సాయంతో ఆ సంఘటనా ప్రాంతానికి వెళ్లి అక్కడి సీసీ కెమెరాలను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చివరకు స్వామివారి అభిషేక నీరు ప్రవహించే తొట్టిలో నీటిని తోడి పరిశీలించగా గొలుసు వెలుగుచూసింది. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. పూజ సమయంలో మెడలోని గొలుసు జారిపడి ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

మొంథా తుఫాన్ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నూజెండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల్లో 15 గ్రామ సచివాలయాల్లో మొంథా తుఫాన్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఎంపీడీవో పీ ఉమాదేవి ఆదివారం తెలిపారు. తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసిన సమయంలో మండల ప్రజలకు అత్యవసర సాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లలో 24గంటలు అధికారులు, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. వర్షానికి ప్రభావితమైన వారు కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిలకలూరిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫానును దృష్టిలో పెట్టుకుని 73826 23153 ఫోన్ నంబర్‌తో విద్యుత్ శాఖ అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట విద్యుత్ డివిజన్ పరిధిలో అత్యవసర సమాచారాన్ని ఈ నంబర్‌కు తెలియచేయాలని అధికారులు కోరారు. విద్యుత్ స్తంభాలు పడినా, వైర్లు తెగినా వెంటనే తెలియచేయాలని, వాటిని తాకరాదన్నారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, సబ్ స్టేషన్‌కు కూడా తెలియచేయవచ్చునని పేర్కొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దారు

ఈపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఈ నెల 27వ తేదీ నుంచి 29వరకు మూడు రోజులు మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో పల్నాడు జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించారు. ఈ మేరకు ఈపూరు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. వాగులు, వంకలు పొంగే అవకాశం ఉందన్నారు. పాఠశాలలకు సెలవులు ఇస్తుండడంతో పిల్లలను బయటకు పంపవద్దన్నారు. వర్షాలకు వీధి స్తంభాలకు కరెంటు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా పిడుగులుపడే అవకాశం ఉన్నందున వర్షం సమయంలో చెట్ల కిందకు వెళ్ళవద్దని హెచ్చరించారు.

తీవ్ర ఆందోళనలో జగన్మోహన్‌రెడ్డి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, లోకేశ్‌లు పెట్టుబడుల కోసం చేస్తున్న నిర్విరామ కృషికి రూపురేఖలు వస్తే తన విద్వేష, విష రాజకీయాలకు కాలం చెల్లుతుందని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా ఆందోళనకు గురవుతున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ పెట్టుబడుల ఆకర్షణ యజ్ఞాన్ని అడ్డుకోవాలనే లక్ష్యంతో జగన్ కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఆర్థిక విధ్వంసం, అవినీతి, దోపిడీ తప్ప పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణపై జగన్ అవగాహన శూన్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈలో, మంత్రి లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించి రాష్ట్రంలోని వనరులు, అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వివరించి, పారిశ్రామికవేత్తలను మెప్పించడంలో విజయం సాధించారని వివరించారు. ఏపీ పేరు ప్రఖ్యాతులు బ్రాండ్‌ను అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడంలో ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారని చెప్పారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం నేరుగా కల్పించే అవకాశాలు, భూకేటాయింపులు, పారిశ్రామిక పాలసీల వివరాలు, ప్రోత్సాహకాల గురించి తెలియచేస్తూ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతే తమ గమ్యమని చాటిచెబుతున్నారని తెలిపారు. కేవలం 16 నెలలలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే వారి పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు.



కళాకారులను అభినందిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

కళాకారుల కార్తీక వనభోజనాలు

వినుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కళాకారుల కార్తీక వనభోజనాలు కార్యక్రమం స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200మంది కళాకారులు పాల్గొన్నారు. కళాకారుల సభలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ కళాకారులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి శర్మ పాటలతో అలరించారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్యే మామ కొత్త వెంకట ఆంజనేయులు, గుమ్మడి కళా పీఠం గౌరవ అధ్యక్షుడు షకీల దస్తగిరి, సీపీఐ నాయకులు మారుతి వరప్రసాద్ పాల్గొని 15మంది వివిధ కళలకు చెందిన కళాకారులను సన్మానించారు. ఆటల పోటీలలో పాల్గొన్న మహిళలకు చీరలు నాయకుల చేతుల మీదుగా అందజేశారు.

మురుగు కాలువల నిర్మాణానికి రూ.కోటి మంజూరు

నాదెండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని హైస్కూల్ రోడ్డు (నాదెండ్ల-చిలకలూరిపేట రహదారి)లో మురుగు కాలువల నిర్మాణానికి జిల్లా పరిషత్ కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. కొద్ది రోజుల క్రితం ఈ రహదారిలోని ఆక్రమణలను పంచాయతీ వారు తొలగించారు. ఎమ్మెల్యే పుల్లారావు సూచనలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.2 కోట్ల వ్యయంతో మురుగు కాలువల నిర్మాణానికి అంచనాలను తయారుచేసి జిల్లా పరిషత్‌కు పంపారు. కాగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కోటి రూపాయలను జడ్పీ మంజూరు చేసింది. ఆ నిధులతో రెండు వైపులా 350 మీటర్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి వచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రశేఖర్ రహదారి పనులను పరిశీలించారు. మురుగు కాలువల నిర్మాణ విషయమై ఏఈ సూర్యతేజ, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావుతో చర్చించారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీలను సమన్వయం చేసుకొని సర్వే చేసి పనులు ప్రారంభించాలని ఏఈకి సూచించారు. అదేవిధంగా సుమారు రూ.32లక్షల వ్యయంతో మరమ్మతులు చేసిన రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్లను ఆయన పరిశీలించారు. పనులు మాజీ సర్పంచ్ హిమవంతరావును అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ విజయ కుమార్ ఫిల్టర్ బెడ్ నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట డీఈ హరనాథబాబు తదితరులు ఉన్నారు.

శ్రామికుల ఈకేవైసీలో గుంటుపాలేనికి ప్రథమస్థానం

శావల్యాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతను పెంపొందింపజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ శావల్యాపురం మండలం గుంటుపాలెంలో నూరు శాతం పూర్తి చేయడంతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మండల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు అన్నవరపు వెంకటేశ్వర్లు ప్రభుత్వం అప్పగించిన ఈకేవైసీపై ప్రత్యేకదృష్టి సారించి ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నవారిని కూడా కలసి ఈకేవైసీని నూరుశాతం పూర్తిచేసి ఆదర్శంగా నిలిచాడు. గ్రామంలో మొత్తం 595మంది శ్రామికులుండగా 595మందికి ఈకేవైసీ పూర్తిచేశాడు. మండలంలో చిన్నకంచెర్ల 88.54శాతంతో, బొందిలిపాలెం 85.67శాతంతో ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. నూరుశాతం ఈకేవైసీ పూర్తి చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లును డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజు ప్రత్యేకంగా అభినందించారు.

బాసట ఆధ్వర్యంలో వైద్య శిబిరం

యడ్లపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో షుగర్, బీపీ వైద్య శిబిరం ఆదివారం జరిగింది. బాసట ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 260మందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు భవ్యతేజ, భవ్యశ్రీలు సేవలందించారు.